నమస్తే తెలంగాణ

ఖమ్మం

5 | ఖమ్మం, మంగళవారం 26 నవంబర్ 2024 | KHAMMAM


- కార్యకర్తలకు దిశానిర్దేశం చేయండి
- ఎంపీ వద్దిరాజుతో మాజీ సీఎం కేసీఆర్

# భవిష్యత్తు మనదే...

ఖమ్మం, నవంబర్ 25 : రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు అన్నివిధాలా పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని, భవిష్యత్తు మనదేనని, కార్యకర్తలు, నాయకులకు దిశానిర్దేశం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్రకు సూచించారు. సోమవారం ఆయన్ని ఫాంహౌస్‌లో కలిసిన సందర్భంగా వద్దిరాజుతో పార్టీ అంశాలపై ముచ్చటించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ భవిష్యత్తు మనదేనని, కాంగ్రెస్ పార్టీపై ప్రజలు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయని తెలిపారు. ప్రజలు కష్టాల్లో ఉన్నారని, వారికి అండగా నిలవాల్సిన బాధ్యత బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై ఉందని సూచించారు. కేసీఆర్ స్వయంగా కారు నడుపుతూ ఉండగా పక్క సీట్లో బీఆర్ఎస్ రాజ్యసభ డిప్యూటీ లీడర్ వద్దిరాజు రవిచంద్ర కూర్చుని ప్రయాణించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో కలిసి మహబూబాబాద్‌లో జరిగిన మహాధర్నా కార్యక్రమాలకు హాజరైన ఎంపీ వద్దిరాజు సాయంత్రానికి కేసీఆర్‌ను కలిసేందుకు ఫాంహౌస్‌కు వెళ్లారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఎంపీ వద్దిరాజును తన కారులో పక్కనే కూర్చోబెట్టుకుని వ్యవసాయ క్షేత్రంలోని వివిధ పంటలను పరిచయం చేస్తూ తను సాగు చేస్తున్న పంటల వివరాలను వివరించారు. కేసీఆర్‌తో ప్రత్యేకంగా గడపడం తను ఎన్నటికీ మరిచిపోనని ఎంపీ వద్దిరాజు తెలిపారు.



మాజీ సీఎం కేసీఆర్ కారు డ్రైవింగ్ చేస్తుండగా పక్కనే కూర్చున్న ఎంపీ వద్దిరాజు



వాజేడు మండలంలోని బొగత జలపాతం




కొత్తగూడెంలో సెంట్రల్ పార్క్

# విహార విడిది.. భద్రాద్రి

- కొత్తగూడెం జిల్లాలో మనసు దోచుకునే పర్యాటక ప్రాంతాలు
- ప్రకృతి ప్రేమికులకు ఆహ్లాదమే.. ఆహ్లాదం
- గోదావరిలో అబ్బురపరిచే లాంచీ ప్రయాణం
- కనువిందు చేసే పాపికొండలు
- కిన్నెరసానిలో బోటు షికారు.. పుట్టి హుషారు
- కొత్తగూడెం పట్టణంలో ఆడవిడుపు కోసం పార్కులు

**విహార యాత్రికులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మంచి విడిదిగా మారింది. కొత్తగూడెం అర్బన్(సెంట్రల్) పార్కు, కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల, బొగత జలపాతం, గుబ్బలమంగి, పెద్దమ్మతల్లి, సమ్మక్క-సారలమ్మ తదితర పర్యాటక ప్రాంతాలు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. మరోవైపు విద్యార్థుల పిక్‌నిక్ స్పాట్‌లకూ కొదువలేదు. కొత్తగూడెం మొదలు వాజేడు వరకు ఉన్న పర్యాటక ప్రాంతాలు ప్రతి ఏడాది చలికాలం ప్రకృతి ప్రేమికులకు వరంగా మారాయి. అంతేకాక ఆంధ్రాలో కలిసిన మన పాపికొండల లాంచీ ప్రయాణం పర్యాటకుల మనసు దోచుకుంటున్నది. నిత్యం బిజీ లైఫ్ బతుకులు మనవి. కనీసం పిల్లలతో గడిపే తీరికలేని రోజులివి. మనసు పులకరించే ప్రదేశాలను చూసి.. ఆ ఆహ్లాదాన్ని కుటుంబంతో పంచుకోవాలంటే మాత్రం భద్రాద్రి జిల్లాలోని ప్రకృతి అందాలను చూసి తీరాల్సిందే.**

*- భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)*

కార్తీకమాసం వచ్చిందంటే చాలు పర్యాటకులు ప్రకృతి వైపు పరుగులు పెడతారు. అలాంటి సుందర దృశ్యాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అనువుగా ఉంది. గత కేసీఆర్ ప్రభుత్వం పర్యాటకానికి ప్రత్యేక నిధులు విడుదల చేసి ప్రకృతి ప్రేమికుల మనసు దోచుకునేలా ఆయా ప్రాంతాలను అభివృద్ధి చేసింది. ఆ పర్యాటక ప్రాంతాలు నేడు మనసును దోచుకుంటున్నాయి. నీటి ప్రవాహంలో సెలయేటి పరవళ్లు.. పక్కనే ప్రకృతి అందాలు.. కొండకోనలు.. చెట్టు చాటున కనబడే అడవి జంతువుల అందాలు చూస్తుంటే ఎవరికైనా మనసు పులకించక మానదు. ఒకటికాదు.. రెండు కాదు ఎన్నో అపురూప దృశ్యాలు మన కళ్లకు కనబడి చిటుక్కున మాయమయ్యే విచిత్ర ఘటనలు.. ఆ మధుర క్షణాలు తీపి గురుతులుగా మిగిలిపోతున్నాయి.

### కార్తీకమాసంలో జాలీ ట్రిప్..

విహారయాత్రలకు వెళ్లే కార్తీకమాసం రానే వచ్చేసింది. కొంతమంది ప్రాచీన ఆలయాల దర్శనాలు, తీర్థయాత్రలకు వెళ్తుంటే మరికొంతమంది పర్యాటక ప్రాంతాల్లో విహారం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం అర్బన్(సెంట్రల్) పార్కు, కిన్నెరసాని, భద్రాచలం, పర్ణశాల, బొగత జలపాతం, గుబ్బలమంగి, పెద్దమ్మతల్లి, సమ్మక్క-సారలమ్మ తదితర ప్రాంతాలకు వెళ్లి ఆహ్లాదాన్ని పంచుకుంటున్నారు. మరికొంతమంది విద్యార్థులు పిక్‌నిక్ స్పాట్‌లకు వెళ్తున్నారు.

### బోటు షికారుకు ఆదరణ

అన్ని ప్రాంతాల్లో నదులు, వాగులు ఉండడం అరుదు. నీటిలో బోటు షికారు చేస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. అలాంటి బోటు షికారు కొత్తగూడెం నియోజకవర్గంలోని కిన్నెరసాని ప్రాంతంలో ఉంది. డ్యాంలో జోరున పారే నీటి సెలయేరు పర్యాటకులకు ఆహ్లాదాన్ని పంచుతున్నది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉన్న పాపికొండల్లో గోదావరి నదిలో లాంచీ ప్రయాణం పర్యాటకులను అబ్బురపరుస్తున్నది. పాపికొండల్లో విహారం ఎంతో ఆనందానిస్తుంది. వెదురుతో చేసిన బొమ్మలు, పూల మందిరాలు, కొండకోనల అందాలు ప్రకృతి ప్రేమికుల మనస్సును పులకింపజేస్తాయి. కొత్తగూడెం జిల్లాకేంద్రంలో సెంట్రల్ పార్కులో పర్యాటకులు సందడి చేస్తున్నారు. సెలవులు, ఆదివారాలు వస్తే పిల్లాపాపలతో అర్బన్‌పార్కుకు వచ్చి ఆటవిడుపుగా ఎంజాయ్ చేస్తున్నారు. గత ఏడాది ప్రారంభించిన ఈ సెంట్రల్ పార్కు ప్రస్తుతం కొత్త అందాలతో రూపుదిద్దుకుంది. పాపికొండల విహారయాత్రకు ప్రత్యేక ప్యాకేజీ కూడా అందుబాటులో ఉంది. కిన్నెరసాని టూరిజంపై కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పుట్టిని కూడా ఏర్పాటు చేశారు. దీంతో పర్యాటకులు కిన్నెరసానిలో సందడి చేస్తున్నారు.

### జిల్లాలో పర్యాటక ప్రాంతాలు ఇవే

**కొత్తగూడెం :** సెంట్రల్ పార్క్, సింగభూపాలెం, కిన్నెరసాని బోటింగ్, అద్దాలమేడ, జింకలపార్కు
**బూర్గంపాడు :** వేలేరు వద్ద పాములేరు
**భద్రాచలం :** భద్రాచలం కరకట్ట, పర్ణశాల, గుబ్బలమంగి, దుమ్ముగూడెం ప్రాజెక్టు, చర్లలో తాలిపేరు
**దుమ్ముగూడెం :** చిన్న అరుణాచలం ఆలయం
**ఇల్లెందు :** ఏడుపాయలవాగు, వాటర్‌పాల్స్
**అశ్వారావుపేట :** మూకమామిడి, దమ్మపేట పామాయిల్ తోటలు, చంద్రుగొండలో వెంగళరావు ప్రాజెక్టు, గుబ్బల మంగమ్మ తల్లి ఆలయం
**మణుగూరు :** సమ్మక్క-సారలమ్మ గద్దెలు, వాటర్‌పాల్స్, అశ్వాపురం భారజల ప్లాంటు
**వాజేడు :** బొగత జలపాతం

### చిన్న అరుణాచలం..

అరుణాచలం అనగానే తమిళనాడులో అతిపెద్ద శివాలయం గుర్తుకు వస్తుంది. ఇప్పుడు అలాంటి అరుణాచలం శివయ్య మన భద్రాచలం డివిజన్‌లోని దుమ్ముగూడెం మండలంలో కూడా ఉన్నాడు. చిన్న అరుణాచలం భక్తులకు కొంగుబంగారంగా మారింది. అక్కడ ఉన్న లింగాల మాదిరిగానే ఇక్కడ కూడా ఏర్పాటు చేసి పెద్ద శివాలయాన్ని నిర్మాణం చేయడంతో భక్తులు చిన్న అరుణాచలం వద్ద శివుడిని దర్శించుకుంటున్నారు.

### 'బడ్జెట్ హోటల్'తో మరింత శోభ..


గత కేసీఆర్ ప్రభుత్వం పర్యాటక రంగానికి పెద్దపీట వేసింది. జిల్లా కేంద్రంలో సకల సౌకర్యాలతో ఏర్పాటు చేస్తున్న బడ్జెట్ హోటల్‌తోపాటు కిన్నెరసానిలో అద్దాల మేడకు రూ.12 కోట్ల నిధులు మంజూరు చేసింది. మరో ఆరు నెలల్లో పనులు పూర్తికానున్నాయి. బడ్జెట్ హోటల్ పూర్తయితే పర్యాటకుల తాకిడి జిల్లా కేంద్రానికి ఎక్కువగానే ఉండనున్నది. అతి విశాలమైన గదులతో బడ్జెట్ హోటల్ నిర్మాణం జరుగుతున్నది.

### కనువిందు చేసే పాపికొండలు..

పాపికొండల నడుమ సాగే లాంచీ ప్రయాణం భలే సరదాగా ఉంటుంది. ఉదయం 9 గంటలకు బయలు దేరే లాంచీలు సాయంత్రానికి తీరానికి వస్తాయి. తర్వాత పర్ణశాల, భద్రాచలంలో విడిది చేసేందుకు వసతి సౌకర్యాలు కూడా ఏర్పాటు చేశారు.



పాపికొండల గోదావరిలో లాంచీ ప్రయాణం



నారచీరెల ప్రాంతం



దుమ్ముగూడెం వద్ద పర్ణశాల రాములోరి కుటీరం



కిన్నెరసాని ప్రాజెక్టులో కొత్తగా ఏర్పాటు చేసిన పుట్టి

### లాంచీ ప్రయాణం బాగుంది..



కార్తీకమాసంలో విహారయాత్ర చాలా ఎంజాయ్‌గా ఉంటుంది. ప్రతిసారి ట్రిప్‌కు వెళ్తున్నాం. లాంచీ ప్రయాణం చాలా బాగుంది. కుటుంబ సమేతంగా వెళ్తున్నాం. భద్రాచలం ఆలయం, పర్ణశాల, బొగత జలపాతాలు బాగున్నాయి. మళ్లీ చూడాలనిపిస్తున్నది. ప్రకృతి రమణీయతను ఆస్వాదించాల్సిందే. చాలా ఎంజాయ్ ట్రిప్ మాది. చిన్న అరుణాచలం సైతం చాలా బాగుంది.

– సృజన, హైదరాబాద్

### సీజన్ వచ్చిందంటే మాకు పండుగే..



కార్తీకమాసం వచ్చిందంటే మా ప్రాంతానికి పండుగే. పర్యాటకులు బాగా వస్తుంటారు. రామాయణ చరిత్ర ఇక్కడే ఉంది. సీతమ్మ నారచీరెలు, రాముడుసీతమ్మ పాదాలు ఇక్కడ ఉన్నాయి. కుటీరం కూడా ఉంది. ప్రతిఒక్కరూ భద్రాచలం వచ్చాక ఇక్కడకు రావాల్సిందే. గోదావరి తీరం చాలా బాగుంటుంది. పర్యాటకులు చాలా ఆనందంగా గడుపుతున్నారు.

– ద్రాక్షాయిని, పర్ణశాల, వ్యాపారి

# దిగుబడి ఎలా ఉంది? ధాన్యం డబ్బులు వచ్చాయా?

రైతులతో ముఖాముఖిలో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

సత్తుపల్లి, నవంబర్ 25 : ఎంత విస్తీర్ణంలో వరి సాగు చేశారు? దిగుబడి ఎంత వచ్చింది? కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయిస్తే డబ్బులు సకాలంలో వస్తున్నాయా? అని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ పలువురు రైతులను అడిగి తెలుసుకున్నారు. సోమవారం తల్లాడ మండల కేంద్రంలోని వంగాపురం రోడ్డులో గల రైతు తమ్మిశెట్టి లక్ష్మీనర్సయ్యకు చెందిన పొలంలో వరి కోతలను పరిశీలించిన కలెక్టర్.. పొలం గట్టుపై కూర్చొని అక్కడి రైతులతో మాట్లాడారు. సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరి కోత మిషన్‌పై కూర్చొని కోతలను ప్రత్యక్షంగా పరిశీలించారు. రైస్ మిల్లర్ల దగ్గర ఏమైనా కోతలు పెడుతున్నారా? అధికారుల స్పందన ఎలా ఉంది? అని ఆరా తీశారు. తమిళనాడు నుంచి వచ్చిన వరి కోత యంత్రం గంటకు ఎంత కోత కోస్తుంది? ఎన్ని డబ్బులు అవుతాయి? అని అడిగి తెలుసుకున్నారు. పొలం గట్లపై కూర్చొని రైతులతో ముఖాముఖి మాట్లాడుతూ.. సాగునీటి వసతి ఎలా ఉంది? విద్యుత్ సమస్యలు ఏమైనా ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ధరణి సమస్యలు ఏమైనా ఉంటే.. కలెక్టరేట్‌లో ధరణి సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, దరఖాస్తుల సమర్పణ విషయంలో అధికారుల సహకారం తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పిస్తున్నదని, ప్రైవేటుకు దీటుగా విద్యాబోధన చేస్తున్నామని, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని కలెక్టర్ రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట తల్లాడ వ్యవసాయాధికారి తాజుద్దీన్, ఏఈవోలు మురళీకృష్ణ, సాయికుమార్, శివకుమార్, రైతులు ఉన్నారు.

# కేసీఆర్ దీక్షా స్ఫూర్తితో పోరాటాలు

- 29న జరిగే దీక్షా దివస్‌ను జయప్రదం చేయండి
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపు



మాట్లాడుతున్న రేగా కాంతారావు, పక్కన మజీ ఎమ్మెల్యే వనమా, మెచ్చా, హరిప్రియ

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 25 : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న నిరంకుశ విధానాలు, కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ పోకడలకు వ్యతిరేకంగా కేసీఆర్ దీక్షా స్ఫూర్తితో పోరాటాలు చేస్తామని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 29న చేపట్టనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని కోరుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి రేగా ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2009, నవంబర్ 29న కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టడంతోనే తెలంగాణ ఉద్యమం పతాక స్థాయికి చేరిందన్నారు. ఆయన దీక్షతోనే కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన చేసిందన్నారు. పదేళ్లు రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రిగా కేసీఆర్ ఎలాంటి లోటు లేకుండా పాలన అందించారన్నారు. కానీ.. అలవిగాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంపై 11 నెలల్లోనే ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని, ఇచ్చిన హామీలన్నీ నీటి మూటలుగా మిగిలిపోయాయని ఆరోపించారు. అన్ని వర్గాల ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంతవరకు పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ మంత్రి వనమా వెంకటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చా నాగేశ్వరరావు, బానోతు హరిప్రియా నాయక్, జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు దిండిగాల రాజేందర్, నాయకులు మానె రామకృష్ణ, మంతపురి రాజుగౌడ్, మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, వైస్ ఛైర్మన్ దామోదర్, సీనియర్ నాయకులు మోరె భాస్కర్‌రావు, సంకుబాపన అనుదీప్, కొట్టి వెంకటేశ్వర్లు, పూజిత, వెంకటరెడ్డి, పోచం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## హాస్టళ్లను నిరంతరం పర్యవేక్షించాలి: కలెక్టర్



కలెక్టర్ జితేశ్ వి పాటిల్

కొత్తగూడెం ఎడ్యుకేషన్, నవంబర్ 25 : జిల్లా, మండల స్థాయి అధికారులు తమ పరిధిలోని సంక్షేమ వసతి గృహాలను నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ ఆదేశించారు. సోమవారం జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ట్రైబల్ వెల్ఫేర్ హాస్టళ్లు, ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్లు వేణుగోపాల్, విద్యాచందన, ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మతో కలిసి జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సంబంధిత అధికారులతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హాస్టళ్లను వ్యక్తిగతంగా వెళ్లి పరిశీలించి అక్కడ నెలకొన్న పరిస్థితులు, సమస్యలపై ఫొటోలతో కూడిన నివేదిక అందించాలన్నారు. విద్యార్థులు తమ ప్లేట్లను శుభ్రం చేసుకోకుండా.. వర్కర్లు శుభ్రం చేసి ప్లేట్లు భద్రపరిచే విధంగా సౌకర్యాలు కల్పించాలన్నారు. హాస్టళ్లు, పాఠశాలల్లో పరిశుభ్రమైన, నాణ్యమైన ఆహారం అందించే బాధ్యత పాఠశాల హెచ్‌ఎంలు, ప్రిన్సిపాళ్లు, హాస్టల్ వార్డెన్లదేనని అన్నారు. మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఉదయం 11 గంటలకు అధికారులందరూ ప్రతిజ్ఞ చేయాలని సూచించారు.

## అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

### వినతులు స్వీకరించిన అదనపు కలెక్టర్లు



వినతి పత్రాలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

మామిళ్లగూడెం, నవంబర్ 25 : పలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చి తమ సమస్యలపై సమర్పించిన అర్జీలను పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డిలు వివిధ శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఖమ్మం అర్బన్ మండలం రామన్నపేట గ్రామానికి చెందిన కూచిపూడి సన, అర్బన్ మండలం కైకొండాయిగూడెంకు చెందిన కట్ల రమాదేవి, వేంసూరు మండలం కొత్త చౌడవరం గ్రామానికి చెందిన శ్రీను, కొణిజర్లకు చెందిన కొర్లపాటి ధనమ్మ తదితరులు తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వాటిని అదనపు కలెక్టర్లు ఆయా శాఖల అధికారులకు పంపించి పరిష్కరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్వో రాజేశ్వరి, కలెక్టరేట్ ఏవో అరుణ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పత్తి@రూ.7,025

- ఒక్కరోజు వ్యవధిలోనే రికార్డు స్థాయి ధర
- మాజీ మంత్రి హరీశ్‌రావు పర్యటన ఎఫెక్టు



రైతులు తీసుకొచ్చిన పత్తి బస్తాలు

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 25 : ఖమ్మం నగర వ్యవసాయ మార్కెట్లో పత్తి ధర పెరుగుదలపై మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్ఎస్ నాయకుల పర్యటన ప్రభావం స్పష్టంగా కనపడింది. ఈ నెల 22వ తేదీన శుక్రవారం మాజీ మంత్రి టీ హరీశ్‌రావు మాజీ మంత్రులు గంగుల కమలాకర్, పువ్వాడ అజయ్‌కుమార్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, బీ చంద్రావతితో పాటు ఇతర రాష్ట్ర నాయకులతో కలిసి ఖమ్మం మార్కెట్ పరిధిలోని పత్తి యార్డును సందర్శించిన సంగతి తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగా మార్కెట్ కమిటీ అధికారుల నుంచి గత కొద్దిరోజులుగా రైతులకు అందుతున్న ధరల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సగటున క్వింటాల్‌కు ఒక్కంటికి రూ.6,500 మాత్రమే పలుకుతుందని, తద్వార పత్తి రైతులు క్వింటాల్‌కు ఒక్కంటికి రూ.1000-1500 వరకు నష్టపోతున్నారని మండిపడ్డారు. రైతులకు జరుగుతున్న నష్టాన్ని అసెంబ్లీ సమయంలో ప్రశ్నిస్తానని రైతులకు భరోసా కల్పించారు. అయితే వరుసగా రెండురోజుల సెలవుల అనంతరం సోమవారం మార్కెట్లో క్రయవిక్రయాలు ప్రారంభమయ్యాయి. ఎవ్వరూ ఊహించని విధంగా ఉదయం జరిగిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో క్వింటాల్ పత్తి రూ.7,025 పలికింది. మెజార్టీ మంది రైతులకు క్వింటాల్ రూ.6,800 నుంచి రూ.7 వేల వరకు పలకడం విశేషం. అయితే పెరిగిన ధరలు మరికొన్ని రోజులపాటు ఉంటాయా.. ఒకటీ రెండురోజులకే పరిమితమవుతాయా వేచిచూడాలి.

## 'బార్' ఆధ్వర్యంలో న్యాయవాదుల నిరసన




నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఖమ్మం లీగల్, నవంబర్ 25 : నాన్ క్యాడర్ పీపీ పోస్టులను క్యాడర్ పోస్టులు చేయొద్దని తీసుకొచ్చిన జీవో 16, 12ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మధ్యాహ్నం జిల్లా కోర్టు ఆవరణలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శ్రీనివాసరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కొల్లి సత్యనారాయణ, సీనియర్ న్యాయవాదులు నిరంజన్‌రెడ్డి, బిచ్చాల తిరుమలరావు, కొత్త వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. జీవో నెంబర్ 16, 12 ద్వారా క్యాడర్ పోస్టు ప్రమోషన్‌తో నాన్ క్యాడర్ పోస్టు లేకుండా చేయాలని కుట్ర పన్నారని పేర్కొన్నారు. దీనిపై బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తీర్మానం చేసి సెక్రెటరీ రవి గుప్తాకు పంపించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ కార్యదర్శి చింతనిప్పు వెంకట్, తాళ్లూరి దిలీప్ చౌదరి, ముక్తేశ్వరరావు, పసుపులేటి శ్రీనివాసరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## గిరిజనులకు పథకాలు అందించడమే లక్ష్యం

### గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ పీవో రాహుల్



వినతులు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

భద్రాచలం, నవంబర్ 25 : అభివృద్ధి, సంక్షేమ పథకాలు గిరిజనులకు అందించడమే ఐటీడీఏ లక్ష్యమని పీవో రాహుల్ అన్నారు. భద్రాచలం ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన గిరిజన దర్బార్‌లో పీవో గిరిజనుల నుంచి అర్జీలు స్వీకరించారు. తన పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించి.. మిగిలిన వాటిని అధికారులకు పంపించి పరిష్కరించేలా చూడాలని ఆదేశించారు. ట్రైకార్ ద్వారా సబ్సిడీ రుణాలు, పోడు భూములు, వ్యక్తిగత సమస్యలు, స్వయం ఉపాధి పథకాలకు రుణాలు, పట్టా భూములకు రైతుబంధు వర్తింపజేయాలని, జీవనోపాధి పెంపొందించేందుకు ఆర్థిక సాయం, దీర్ఘకాలిక రోగాలకు వైద్యం చేయించుకునేందుకు సాయం, గురుకులం సీట్లు, పై చదువులకు ఆర్థిక సాయం తదితర సమస్యలపై అర్జీలు వచ్చినట్లు తెలిపారు. అలాగే గిరిజన సంక్షేమ ఆశ్రమ, గురుకుల పాఠశాలల్లో విద్యార్థినీ విద్యార్థుల పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటూ.. వారిని ఇండ్లకు పంపకుండా విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్, ఎస్డీసీ ఎస్డీసీ రవీంద్రనాథ్, డీడీ మణెమ్మ, ఆర్సీవో నాగార్జునరావు, ఏవో సున్నం రాంబాబు, ఎస్‌వో భాస్కరన్, ఉద్యానవన అధికారి ఉదయ్‌కుమార్, ఏపీవో పవర్ మునీర్‌పాషా, డీటీఆర్‌వోఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.